# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**JULY - 2017**

సంవత్సర చందా రూ. 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

**సత్యవాణి**

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6.30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 గంటలకు రక్షణ |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీ గూటం |
| | | రోనీ గూటం |

**Youtube లో satyavanichurchofchrist.com**

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి

**SATYA VANI**

**P.O.BOX. 80, KAKINADA**

**PIN : 533004. Ph : 0884 - 2363722**

**98489 98547, www.satyavanicoc.com**

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

| సంపుటి - 38 | జూలై - 2017 | సంచిక -12 |
|---|---|---|


## సబ్బాతు ఇంకను నిలిచియున్న యెడల

## ( If the Sabbath is still binding )

శనివారమే సబ్బాతు దినమనియు, క్రైస్తవులు సబ్బాతును ఆదివారమునకాక శనివారమునే ఆచరించ వలెననియు కొందరు బోధకులు ఆయా గ్రామములకు వెళ్ళి బోధించుచున్నట్లును, సబ్బాతు దినము యొక్క సత్యమును తెలిసికొనగోరు చున్నట్లును కొంతమంది మాకు ఉత్తరములు వ్రాసారు. సత్యమును అన్వేషించుచున్న ఈ మా చదువరులను గూర్చి మేము దేవుని స్తుతించుచున్నాము.

శనివారమే సబ్బాతు దినము అను సంగతి ఎవరును కాదనరు. అయితే క్రైస్తవ యుగములో దేవుని ఆరాధించు దినము (సబ్బాతు దినమయిన) శనివారము కానేకాదు. ప్రభువు దినము వారములో ఆఖరి దినముకాక మొదటి దినమైయున్నది. అనేకులు ఆదివారమును సబ్బాతు దినమని పిలుచుచుందురు. గాని అది కేవలము పొరపాటు. ఆదివారము శనివారము ఎట్లుకాదో అట్లే ఆదివారము సబ్బాతు దినము కాదు. బైబిలులో 'సబ్బాతు దినము' అని కనబడుటకు బదులు విశ్రాంతి దినము అని కనబడును. ఆ విశ్రాంతి దినము వారములో ఏడవదినము. దేవుడైన యెహోవా ఇశ్రాయేలీయు లను ఇట్లు ఆజ్ఞాపించెను : 'విశ్రాంతి

దినమును పరిశుద్ధ దినముగా ఆచరించుటకు జ్ఞాపక ముంచుకొనుము. ఆరు దినములు నీవు కష్టపడి నీ పని అంతయు చేయవలెను. ఏడవ దినము నీ దైవుడైన యెహోవాకు విశ్రాంతి దినము'' (నిర్గమ 20:8-10).

సబ్బాతు దినము శనివారమని మనము తెలిసికొనిన తరువాత క్రైస్తవులు సబ్బాతును ఆచరించవలెనా? యను ప్రశ్నను మనము ఇప్పుడు చూచుకొందుము. దీని గూర్చిన సత్యమును మనము తెలిసికొనవలెనంటే అసలు సబ్బాతు దినమును ఎవరికి ఎందువలన ఎప్పుడు ఆచరించవలెనని ఆజ్ఞాపింపబడిరో మనము ముందు తెలిసికొనవలెను.

దేవుడు తన సృష్టి పని యంతటి నుండి యేడవ దినమున విశ్రమించెనని ఆదికాండము 2:3లో మనకు కనబడుచున్నను, అప్పటి నుండి ఇంచుమించు 2500 సంవత్సరముల తరువాత మాత్రమే సబ్బాతు దినము ఒక ఆరాధనదినముగాను, పరిశుద్ధ దినముగాను ఆచరించవలెనని ఇశ్రాయేలీయులు ఆజ్ఞాపింపబడిరి.

సబ్బాతును ఆచరించవలెనని ఎవరికి ఆజ్ఞాపింపబడెను? ఇశ్రాయేలీయు లందరు ఐగుప్తు నుండి విడుదల పొంది సీనాయి కొండకు వచ్చు వరకు సబ్బాతును గూర్చి దేవుడు వారిని ఆజ్ఞాపించలేదు. "మోషే ఇశ్రాయేలీయుల నందరిని పిలిపించి యిట్లనెను. ఇశ్రాయేలీయులారా, నేను మీ వినికిడిలో నేడు చెప్పుచున్న కట్టడలను, విధులను విని వాటిని నేర్చుకొని వాటిననుసరించి నడువుడి. మన దేవుడైన యెహోవా మనతో నిబంధనచేసెను. యెహోవా, మన పితరులతో కాదు, నేడు యిక్కడ సజీవులమైయున్న మనతోనే యీ నిబంధనచేసెను" (ద్వితీ 5:1-3). దీనిని బట్టి ఇశ్రాయేలీయుల పితరులగు అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులు సబ్బాతును ఆచరించుట యెరుగరని, మోషే ఈ మాటలు చెప్పు సరికి సజీవులైయున్న ఇశ్రాయేలీయులతో సబ్బాతు ఆచరించుట ఆరంభమైనదని మనము గ్రహించుకొనవచ్చును.

ఎందుకు ? అయితే ఇంచుమించు 2,500 సంవత్సరముల తరువాత దేవుడు సబ్బాతును గూర్చి

ఎందుకు ఇశ్రాయేలీయులను ఆజ్ఞాపించెను? ఈ ప్రశ్నకు జవాబుగా మనము ద్వితీ 5:15ను ఇప్పుడు చదువుకొందము : "నీవు ఐగుప్తు దేశమందు దాసుడవై యున్నప్పుడు నీ దేవుడైన యెహోవా బాహుబలము చేతను చాచిన చేతి చేతను నిన్ను అక్కడ నుండి రప్పించెనని జ్ఞాపకము చేసికొనుము. అందుచేతను విశ్రాంతి దినము ఆచరించవలెనని నీ దేవుడైన యెహోవా నీకు ఆజ్ఞాపించెను". ఐగుప్తు దేశమందు దాసులుగా యెవరుండిరి? ఇశ్రాయేలీయులా? అన్యజనులా? ఇశ్రాయేలీయిలే గదా! అట్లయినప్పుడు ఐగుప్తులో బానిసలుగా యుండని మరెవరికైనను ఈ ఆజ్ఞ వర్తించునా? వర్తించదు. అయితే దేవుడు సబ్బాతును ఆచరించవలెనని ఎందు నిమిత్తము ఇశ్రాయేలీయుల నాజ్ఞాపించెను? యెహోవా తన బాహుబలము చేత వారిని దాసత్వము నుండి విడిపించెనని వారు జ్ఞాపకముంచుకొను నిమిత్తము దేవుడు వారి నాజ్ఞాపించెను. ఇప్పుడు మరొకప్రశ్న : ఇశ్రాయేలీయులు తప్ప మరెవరైనను ఐగుప్తు దేశపు బానిసత్వము నుండి విడిపించబడిరా? ఎవర్శు లేనేలేరు.

కాబట్టి సబ్బాతును ఆచరించ వలెననెడి ఆజ్ఞ ఇశ్రాయేలీయులకే గాని మరెవరికిని వర్తించదు అని నీవు గ్రహించుకొనుము. అది ఇశ్రాయేలీయులకు ఆజ్ఞాపింవబడి నందున క్రైస్తవులకు అది వర్తించనే వర్తించదు. నరిగదా, క్రైస్తవులు మోషే ధర్మశాస్త్రమును బట్టిగాక క్రొత్త నిబంధనను బట్టి నడుచుకొను వారై యున్నారు.

ఇప్పుడు కూడ శనివారము నాడు సబ్బాతును ఆచరించవలెనని బోధించువారు, దేవుడు ఆజ్ఞాపించిన రీతిగ దానిని ఆచరించుట లేనేలేదు. సబ్బాతును ఆచరించువారు శనివార దినమున ఏపనియు చేయరాదు. దేవుని ఆజ్ఞఇట్లున్నది : "కావున మీరు విశ్రాంతిదినము నాచరించవలెను. నిశ్చయముగా అది మీకు పరిశుద్ధ దినము;... ఆ విశ్రాంతి దినమున పనిచేయు ప్రతివాడును తప్పక మరణ శిక్షనొందును" (నిర్గమ 31:14-16). అట్లయితే శనివారమే ఆరాధన దినమని ఇప్పుడు కూడ వాదించువారు శనివారమున పనిచేయుట మానివేయుచున్నారా? లేనేలేదు. గనుక దేవుని మాట ప్రకారము వారు తప్పక

మరణశిక్ష నొందవలసినదేగదా? అయితే ఆ నిబంధనలో ఎవరె రున్నారో మనము అపార్ధము సికొనుకుండు నిమిత్తము నిర్గమ 1:17లో అది నాకును, ఇశ్రాయేలీయులకును ఎల్లప్పుడు గురుతై యుండును అని యెహోవా దేవుడు పలికెను.

"సబ్బాతుదినము నాచరించు వారు, విశ్రాంతి దినమున తమ యిండ్లలో ఎక్కడను అగ్ని రాజబెట్ట కూడదు" అని నిర్గమ 35:3లో వ్రాయబడియున్నది. సబ్బాతు దినము ఇప్పటి కింకను నిలచియున్నదని బోధించు మన మిత్రులు తమ యిండ్లలో శనివారమునాడు భోజన పానాదులను తయారు చేసికొనుట లేదా? అట్లయితే దేవుని ఆజ్ఞను వారు ప్రత్యక్షముగా ఉల్లంఘించుచున్నారు గదా! సబ్బాతును దేవుడు ఆజ్ఞాపించిన రీతిగా చేయనివారికి మరణశిక్ష విధింపబడవలెనని దేవుడు చెప్పిన దానిని వారొకసారి జ్ఞాపకము చేసికొన వలెనని హెచ్చరించుచున్నాను.

సబ్బాతు దినమున పనిచేసిన వానికి, తన పొయ్యి రాజబెట్టుటకై కట్టెలు ఏరిన వానికి ఎట్టి శిక్ష విధింపబడెనో సంఖ్యా 15:32-36లో వ్రాయబడియున్నది. "ఇశ్రాయేలీయులు అరణ్యములో ఉన్నప్పుడు ఒకడు విశ్రాంతి దినమున కట్టెలు ఏరుట చూచిరి. తరువాత యెహోవా ఆ మనుష్యుడు మరణశిక్ష నొందవలెను. సర్వసమాజము పాళెము వెలుపల రాళ్ళతో వానిని కొట్టి చంపవలెనని మోషేతో చెప్పెను. కాబట్టి యెహోవా మోషేకు ఆజ్ఞాపించినట్లు సర్వసమాజము పాళెము వెలుపలికి వానిని తీసికొని పోయి రాళ్ళతో వానిని చావగొట్టెను". సబ్బాతు దినమునాడు కనీసము కట్టెలు ఏరుకొన్న మనుష్యునికి మరణ శిక్ష ఆనాడు విధించబడిన యెడల అంతకంటె ఎన్నోరెట్లు ఎక్కువ పనిని శనివారము నాడు చేయుచున్న మన అడ్వెంటిస్టు మిత్రుల గతి ఈనాడేమై యుండవలసినది?

అంతేకాదు, సబ్బాతు దినము ఇంకా నిలచి యున్నదని బోధించు వారు ఆ దినమున దేవునికి పశుబలుల నర్పించవలసియున్నది. సంఖ్యా కాండము 28:9,10లో ఇట్లు వ్రాయబడి యున్నది. "విశ్రాంతి

టనమున నిర్దోషమైన యేడాదివగు రెండు గొఱ్ఱెపిల్లలను నైవేద్యరూపము గాను, దాని పానార్పణముగా నూనెతో కలపబడిన తూమెడు పిండిలో రెండు పదియవ వంతులను అర్పింపవలెను.. యిది ప్రతి విశ్రాంతి దినమున చేయవలసిన దహనబలి". అయితే ఈనాడు జంతు బలులను దేవుని అర్పించు వారెవరున్నారు? నిశ్చయముగా దేవుని నెరుగని వారేకదా?

సబ్బాతును గూర్చిన ఆజ్ఞను దేవుడు ఇశ్రాయేలీయులకే గాని మన కియ్యలేదు. ఒకవేళ మనము సబ్బాతును ఆచరించవలెనని ప్రయత్నము చేసినను ఆ దినమందు దేవుడు చెప్పిన దానిని యావత్తును చేయవలెను. లేనియెడల మనము మరణశిక్షకు పాత్రులమగుదుము. నిజానికి మనము సబ్బాతును ఆజ్ఞాపించు చట్టము క్రింద లేక దానికంటె శ్రేష్ఠమైన క్రీస్తు చట్టము క్రింద యున్నాము. యేసుక్రీస్తు సబ్బాతు సంబంధమైన చట్టమును మేకులతో తన సిలువకు కొట్టి దానిని మనము అడ్డము లేకుండా ఎత్తివేసెను. అందువలన క్రైస్తవులు శనివారమున గాక ఆదివారమున దేవుని నారాధించవలెనని ఆయన ఆజ్ఞాపించు చున్నారు. దీని విషయమైన మరికొన్ని సత్యములను మా తరువాత సంచికలో నేర్చుకొందుము.

## దేవుడు ప్రార్థనల కెట్లు జవాబిచ్చును?

## ( How does God answer Prayers ?)

బైబిలు ఇట్లు చెప్పుచున్నది. "ఆయనను బట్టి మనము కలిగిన ధైర్యమేమనగా ఆయన చిత్తాను సారముగా మనమేది అడిగినను ఆయన మన మనవి ఆలకించున నునదియే. మనమేమి అడిగినను ఆయన మన మనవి ఆలకించునని మనమెరిగిన యెడల మనమాయనను వేడుకొనినవి మనకు కలిగినవని యెరుగుదుము" (1యోహాను 5:14,15). మరియు "మీ పాపములను ఒకనితో నొకడు ఒప్పుకొనుడి; మీరు స్వస్థత పొందునట్లు ఒకని కొరకు ఒకడు ప్రార్థన చేయుడి. నీతిమంతుని విజ్ఞాపన మన:పూర్వకమైనదై బహు బలము గలదై యుండును" (యాకోబు 5:16).

తన ఆత్మీయ కుటుంబము యొక్క ప్రార్థనలకు దేవుడు జావాబిచ్చును. అంటే వారడిగినట్లే దేవుడిచ్చేస్తాడని దీని యర్థముకాదు, మరియు మనమనుకొనిన రీతిగా ఆయన జవాబీయకపోవచ్చును.

మొదటిగా మనమడిగిన దానిని ఆయన 'అవునని' జవాబీయవచ్చును. చెరసాలలో యున్న పేతురును గూర్చిన ప్రార్థనకు ఆయన అవునని జవాబిచ్చెను (అపో.కా. 12:5-12). రెండవదిగా, దేవుడు 'కాదు' అని మనప్రార్థనలకు జవాబిచ్చును. ఆయన అవునన్నా, కాదనినా అది మన ప్రార్థనలకు జవాబే. ద్వితీయోపదేశ కాండము 3: 23-25లో తనకు వాగ్దాన దేశములో ప్రవేశము కొరకు మోషే ప్రార్థించాడు. గాని దేవుడు దానికి నిరాకరించారు. "నేను అద్దరికి వెళ్లి యోర్దాను అవతల నున్న యీ మంచిదేశమును, మంచి మన్నెమును ఆ లెబానోనును చూచునట్లు దయచేయుమని నేను యెహోవాను బ్రతిమిలాడుకొనగా, యెహోవా మిమ్మును బట్టి నామీద కోపపడి నా మనవి వినకపోయెను" అని అతడు ఇశ్రాయేలీయులకు తెలియజెప్పాడు. కొన్ని శతాబ్దముల తరువాత ఏలియాతో కలిసి మోషే ఆత్మ స్వరూపముగా యేసుకు ప్రత్యక్షమై క్రీస్తు యొక్క సిలువశ్రమలను గూర్చి సంభాషించెను (మత్తయి 17:3).

దేవుడు మనమడిగిన దానిని నివారించినప్పుడు దానికంటే శ్రేష్టమైనది ఏదో ఆయన మన కొరకు దాచి యుంచారని మనము తలంచవలెను. చివరిగా దేవుడు తన అమిత జ్ఞానము చొప్పున మన ప్రార్థనలకు జవాబిచ్చుటకు ఆలస్యము చేయ వచ్చును. యోబు ప్రార్థించాడు. అయితే దేవుని చిత్తము ఇంకో విధముగా యున్నదని అతడు అప్పుడు గ్రహించలేదు (యోబు 2:4-6).

- డెన్నిస్‌గుల్లెడ్జ్

# దేవుని ఆలయము

## ( The Temple of God )

దేవాలయం అంటూ మనకు ఏమీ లేదని క్రైస్తవులు తలస్తారు. అది ఒక విధంగా నిజమే. భౌతిక దేవాలయం మనకు యేమీలేదు. గాని ఆత్మీయ ఆలయం మనకున్నది. 1కొరింధీ 3:16లో పౌలు "మీరు దేవుని ఆలయమై యున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించు చున్నాడనియు మీరెరుగరా?" యని ప్రశ్నించాడు. ఆత్మీయముగా క్రైస్తవులు దేవుని ఆలయమైయున్నారు. ఆత్మీయముగా వ్యక్తిగతముగా దేవుని ఆత్మ మనలో నివసించుచున్నారు. భౌతిక భవనము యేదీ దేవుని ఆలయము కాజాలదు. అందువలన సంఘము కూడుకొనే ఆలయము దేవుని ఆలయము కాజాలదు, అది ఏదో ఒక పరిశుద్ధస్థలము కాదు.

మన పూర్వీకులు ఆలయము లను బాగుగా ఎరిగినవారు. యెరూషలేములో యూదుల దేవాలయ ముండేది. ప్రతి అన్య జనాంగముల పట్టణములలో ఆలయములుండేవి. కొరింధులో ఒక దేవాలయముండేది. అయితే వాటివలె గాక సంఘము దేవుని ఆలయమైయున్నది. సంఘము సమావేశమైయున్నప్పుడు అది దేవుడు మానవుడు కలసికొనే స్థలమైయున్నది. నిర్గమ 29:42,43లో ప్రత్యక్ష గుడారములో దేవుడు మానవుని కలసికొంటారని మోషే వ్రాసాడు. ప్రత్యక్షగుడార స్థానములో దేవాలయము నిర్మించబడినప్పుడు దేవాలయము ఆ కలసికొనే ప్రదేశమై యుండెను. సంఘము దేవాలయ స్థానములో వచ్చినందున దేవుడు మానవుని సంఘములో కలసికొంటారు. అందువలన దేవుని కలసికొనాలంటే మనము సంఘములో (భౌతిక ఆలయము కాదు) ఉండాలి. దేవుని కలసికొనాలంటే మనం క్రీస్తు సంఘములో ఉండాలి.

సంఘము దేవుడు వసించు స్థలమై యున్నది : దేవుని ఆత్మ మనలో నివసించునని ఇప్పటికే గమనించి యున్నాము. ఎఫెసీ 2:22లో "ఆయనలో మీరు కూడ ఆత్మ మూలముగా దేవునికి నివాస స్థలమై

యుండుటకు కట్టబడుచున్నా... అని వ్రాయబడియున్నది. "మనము జీవముగల దేవుని ఆలయమై యున్నాము. అందుకు దేవుడీలాగు సెలవిచ్చుచున్నాడు. నేను వారిలో నివసించి సంచరింతును, నేను వారి దేవుడనై యుందును. వారు నా ప్రజలై యుందురు" (2కొరింథీ 6:16-18). దేవుడు మానవునితో సహవాసము కలిగి యుండాలి కోరుచున్నారు. మనమును దేవునితో సహవాసము కలిగియుండుటకు కోరుకొనాలి. అయితే దేవునితో సహవాసము కలిగి యుండాలనుకొంటే మనము తప్పక ఆయన సంఘములో యుండాలి.

**సంఘము ఆరాధన స్థలమై యున్నది :** "యేసుక్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మ సంబంధమైన బలులనర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు మీరును సజీవమైన రాళ్లవలెనుండి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు" (1 పేతురు 2:5). యూదులు దేవునికి బలులు అర్పించుటకు, ఆయననారాధించుటకు దేవాలయమునకు వెళ్లేవారు. అట్లే మనము సంఘములో దేవునికి ఆత్మీయ బలులు సమర్పిస్తాము, ఆయనను ఆరాధిస్తాము :- "అయితే యథార్థముగా ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది, అది ఇప్పుడును వచ్చేయున్నది" (యోహాను 4:23). ఆయన ప్రజలు దేవుని నారాధించాలని దేవుడు కోరుచున్నారు, అయితే ఆయన నారాధించగోరు వారు ఆయన సంఘములో యుండాలి. సంఘము యొక్క ప్రాముఖ్యతను గమనించుము. మనము దేవుని కలసికోవాలంటే ఆయనతో సహవాసము కలిగి యుండాలంటే, నిజముగా ఆయన నారాధించాలంటే, మనము తప్పక ఆయన సంఘములో యుండాలి. గనుక సంఘము చాల ప్రాముఖ్యము గదా?

**సంఘములో ప్రవేశించుట ఎట్లు?** "మనమందరము ఒక్క శరీరము లోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి" (1కొరింథీ 12:13). ఆ శరీరమే క్రీస్తుసంఘము (ఎఫెసీ 1:22, 23). గనుక మనము క్రీస్తు సంఘము లోనికి బాప్తిస్మము పొందితిమి. అది దేవుని కలసికొనే ప్రదేశము మరియు " ఎవడైనను దేవుని ఆలయమును

పాడుచేసిన యెడల దేవుడు వానిని పాడు చేయునని" మనము గుర్తుంచు కొనవలెను (1 కొరింధి 3:17). యిది చాలా తీవ్రమైన హెచ్చరికయై యున్నది. అందువలన పాత నిబంధన కాలములో దేవుని ఆలయమును పవిత్రముగా యుంచాలనే దేవుని ఆజ్ఞలు తీవ్రమైనవి. ఇప్పుడు వాటిని మనము గ్రహించగలము. దేవుని ఆలయమును ఎట్లు నిర్మించాలో, అందులో ఎవరు పరిచర్య చేయాలో మొదలగు వాటిని గూర్చి దేవుడు ప్రత్యేక హెచ్చరికలనిచ్చియున్నారు. ఆలయములోని పరికరములన్నియు రక్తముతో శుద్ధిచేయబడవలెను. యాజకులు కూడ తమ్మును తామే శుద్ధి చేసికొనవలెను. "నా పరిశుద్ధ స్థలమును మన్నించవలెను, నేను యెహోవాను" అని ఆయన ఆజ్ఞాపించెను (లేవీ 19:30). మరియు "అపవిత్రుడు పాపశుద్ధి చేసికొనని యెడల అట్టి మనుష్యుడు సమాజములో నుండి కొట్టివేయబడును, వాడు యెహోవా పరిశుద్ధస్థలమును అపవిత్ర పరచెను" (సంఖ్యా 19:20). భౌతిక ఆయలమునే ఇంత పవిత్రముగా యుంచాలని దేవుడు కాంక్షించియుంటే, ఆయన ఆత్మీయ మందిరము ఇంకెంత పవిత్రముగా యుండాలని ఆయన కోరుసు?

దేవుని పరిశుద్ధ స్థలమును పవిత్రముగా యుంచుటకు మనము చాలా జాగ్రత్త వహించాలి. పాత దేవాలయమును అపవిత్రపరచినట్లు మన ఆత్మీయ ఆలయమును అపవిత్ర పరచరాదు. అయినను మన శరీరము లను కలుషితముచేసికొని దేవుని ఆత్మీయ ఆలయమును అపవిత్ర పరచుచున్నాము. పాపములోనే జీవించుచయున్న వానిని దేవుడు పాడు చేయును (1 కొరింధీ 3: 16,17; 6:19,20). మరియు దేవుని ఆరాధనలోనికి ఆయన అనుమతించని సంగతులను చేర్చితే ఆయన ఆలయము (సంఘము) కలుషిత మగును.

దేవుని ఆలయమును పాడు చేసేది మరొకటి యున్నది. అది విభజన. యిది అనేకులను ఆశ్చర్య పరచవచ్చును, గాని పౌలు ఇట్లు వ్రాసాడు : "మీలో కలహములును, అసూయయు ఉండగా మీరు శరీర సంబంధులైన మనుష్యరీతిగా నడుచు

కొనువారు కారా"? (1 కొరింధి 3:3). అవును నిజమే. ఈలోక సంబంధ మైనది, శరీర సంబంధమైనది యేదీ దేవుని ఆయలములో యుండకూడదు. అయినను సంఘములో కలహములు, చీలికలు, కొట్లాటలను గూర్చి తరుచు వినుచునే యుంటాము. అసూయలు, కలహములు సంఘములో ప్రవేశింప నిస్తే మనము దేవుని ఆలయమును పాడుచేయు చున్నాము. దేవుడు మనలను పాడుచేయును (1 కొరింధి 3:17).

మనము ఆలయమును అపవిత్రము చేసినప్పుడు దేవుడు దానిలో నివసించరు. మరియు దేవుని కలసికొనే స్థలము యేమీ మనకుండదు. అట్టిది జరుగ కూడదని మనం అందరము భావిస్తాము. గనుక అపవిత్రమైనది యేదీ సంఘములో ప్రవేశించకుండా జాగ్రత్తపడాలి. ఏలయనగా "నేను పరిశుద్ధుడనై యున్న ప్రకారము మీరును పరిశుద్ధులుగా యుండుడి" యని వ్రాయబడి యున్నది (1 పేతురు 1:16).

- జెర్రీ బేట్స్

# వెయ్యేండ్ల పాలన

## ( Thousand Year Rule )

" ఈ మొదటి పునురుత్థానములో పాలుగలవారు ధన్యులును పరిశుద్ధులునై యుందురు. ఇట్టివారి మీద రెండవ మరణమునకు అధికారము లేదు. వీరు దేవునికిని క్రీస్తుకును యాజకులై క్రీస్తుతో కూడ వెయ్యి సంవత్సరములు రాజ్యము చేయుదురు" (ప్రకటన 20:6).

బైబిల్లోని మహా వివాదాస్పదమైన పుస్తకంలోని మహావివాదాస్పదమైన అధ్యాయం యొక్క మహావివాదాస్పదమైన భాగమే ఈ వెయ్యేండ్ల పరిపాలన. దాని గురించి అనేకమంది వారి యొక్క ఊహాల ప్రకారవే ఒక్కొక్కరు ఒక్కోవిధంగా చెబుతారు గనుకనే ఈ 1000 ఏండ్ల పరిపాలనను గూర్చి క్రైస్తవులు మోసపోతున్నారు.

వ్రాయబడిన కాలము : ప్రకటన గ్రంథం క్రీ.శ 94-96 డొమినిషియన్ ఏలుబడి కాలంలో వ్రాయబడి యుండవచ్చు. సంఘానికి విరోధముగా భయంకరమైన హింస

జరిగే కాలంలో వ్రాయబడింది. నీరో, డొమినిషియన్ అనే ఇద్దరు రోమా చక్రవర్తులు మొదటి శతాబ్దపు క్రైస్తవులపై భీకరమైన హింసను సాగించినందువల్ల ప్రకటన గ్రంథము వీరిద్దరిలో ఏదో ఒకరి కాలమందు వ్రాయబడి యుండాలి.

ప్రకటన గ్రంథము ఒక భాగం అపొకలిప్టిక్ సాహిత్యం, ఒక భాగం ప్రవచనం, మరొక భాగం పత్రికయునై ఉంది. అపొకలిప్టిక్ సాహిత్యం వింతైన గుర్తులతో నిండియున్న ప్రత్యేకమైన రచనయైయున్నది. పాత నిబంధనలో యెహెజ్కేలు, దానియేలు గ్రంథములలో ఎక్కువగాను, యెషయా, యోవేలు, జెకర్యా మరియు పాతనిబంధన ఇతర భాగాలలో అక్కడక్కడా కన్పిస్తుంది.

ప్రకటన గ్రంథం యొక్క సందేశాన్ని మనం ఆలోచించినట్లయితే, తన్ను బాధించుచున్న రోమా సామ్రాజ్యము కడకు పతనమై పోతుందని మొదటి శతాబ్దపు క్రైస్తవులకు అభయమియ్యబడింది. ఆ సందేశం రోమా అధికారులు అర్థం చేసికొంటే ఏమౌతుంది? మొదటగా ఆ గ్రంథపు ప్రతులను పత్మాసు ద్వీపం నుండి తీయడం యోహానుకు కష్టతరమై పోయేది (ప్రకటన 1:11). ఎందుకంటే చెరసాలలో ఉన్నవారి ఉత్తర ప్రత్యుత్తరాలు అప్పుడైనా, ఇప్పుడైనా అధికారులు పరిశీలించిన మీదటనే బయటకు రావలసి ఉంటుంది. రెండవదిగా రోమా అధికారులు ఆ సందేశాన్ని విస్తృతంగా తిరుగనిచ్చే వారు కారు. వారికి దొరికే ఏ పత్రికైనా వారు పట్టివేసేవారు. మూడవదిగా అలాంటి ఒక పత్రికలోని సారాంశం అధికారులకు తెలిసిన యెడల క్రైస్తవులు దేశద్రోహులని ఋజువు చేయడానికి వినియోగించబడేది. ప్రకటన గ్రంథం పత్మాసు ద్వీపంలో నుండి యోహాను ద్వారా బయటకు రోమా అధికారుల చేతులద్వారానే బయటకు వచ్చియుండాలి. మరి వారు దాని సారాంశాన్ని పరిశీలించ లేదా? అంటే పరిశీలించినను ఆ భాషను అర్థం చేసుకోలేక "ఇది ఎక్కువైన క్రైస్తవ మూర్ఖత" అని త్రోసి వేసేవారని ఊహించవచ్చు.

**రాజ్యమును గూర్చిన ప్రవనములు :** ప్రస్తుతం 1000 ఏండ్ల పాలన రాబోతుందని అనే మాటలు ఎక్కువ ప్రచారంలో ఉన్నవి. అలాగే ఆ పరిపాలన భూమి మీదని కొందరు,

భూమి మీద కాదని కొందరి అభిప్రాయము. అయితే మనుష్యుల అభిప్రాయాలతోను, నమ్మకాలతోను కాక, దేవుని జ్ఞానంతోను, వాక్యాను సారంగా ఆలోచిస్తూ ముందుకు సాగిపోవాలి. పరిపాలనకు కావలసిన ప్రాముఖ్యమైన విషయములలో 1. రాజు, 2. ప్రజలు 3. భూభాగం, 4. చట్టం, 5. కాలము అనునవి తప్పని సరిగా ఉండాలి.

ప్రపంచ చరిత్రలో క్రీస్తుపూర్వం 4 మహా సామ్రాజ్యాలు ఈ భూమిని పరిపాలించినవి. అవి 1. బబులోను సామ్రాజ్యము 2. మాదీయ పారశీక సామ్రాజ్యము 3. గ్రీకు సామ్రాజ్యము 4. రోమా సామ్రాజ్యము. ఇందు మొదట పరిపాలించిన బబులోను సామ్రాజ్యపు అధినేత నెబుకద్నెజరు చక్రవర్తి. ఇతడు ఒకనాడు రాత్రి దర్శనములో బ్రహ్మాండమగు ఒక ప్రతిమను, అందు శిరస్సు మేలిమి బంగారమును, ఈ విగ్రహము రొమ్ము, భుజములు వెండియును, దాని ఉదరమును తొడలును ఇత్తడి వియును, దాని మోకాళ్లు ఇపుపవియు, దాని పాదములు ఇనుము మట్టివియై యున్నట్లు చూచెను. ఆ దర్శన భావమును దానియేలు, నెబుకద్నెజరు చక్రవర్తికి వివరిస్తూ - బంగారమయ మైనది జబులోను సామ్రాజ్యమనియు, అతని అనంతరము అతని రాజ్యము కంటే తక్కువైన రాజ్యమొకటి వచ్చునని, అటు తరువాత లోకమంతా ఏలునట్టి మూడవ రాజ్యమొకటి కలుగుననియు, పిమ్మట బలముగా నుండు నాలుగవ సామ్రాజ్యమొకటి పుట్టి భూమిని ఏలుననియు, దాని పరిపాలనలోనే చీలికలు వచ్చి కూలిపోవుననియు వివరిస్తూ ఆ రాజ్యపు చీలికల సమయంలో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించుననియు దానికి మాత్రము నాశనము లేక యుగయుగ ముల పర్యంతరము నిలిచి ముందున్న రాజ్యములను మించిపోవునని చెప్పెను (దానియేలు 2:1-44).

దానియేలు గ్రంథమంతటిని పరిశీలిస్తే ప్రతిమలో గల నాలుగు లోహములకు నాలుగు మహా సామ్రాజ్యములు కనిపించుచున్నవి. అంటే రాజ్యమునకు బదులుగా రూపకాలంకారముగా నాలుగు లోహములు ఉపయోగించబడినవి. అలాగే ఆ నాల్గొవ రాజ్యపు చివరి కాలములో పరలోకమందున్న దేవుడు ఒక చిన్న రాయితో మొత్తం విగ్రహము

లోని నాలుగు లోహములను దంచి, బూడిద చేసిన పిమ్మట ఆ రాతిని మహా భూతలమంత పెద్దదిగా మార్చినట్లు కనబడుచున్నది. ఈ రాయి యుగములు పర్యంతము నిలుచు దేవుడు స్థాపించ బోయే రాజ్యమును సూచించుచున్నది. ఆ రాజుల కాలములోనే దేవుడు తన రాజ్యమును భూమిమీద స్థాపించునను విషయము విశదమగుచున్నది.

క్రీస్తు శకములో అనగా క్రీస్తు తరువాత ప్రకటన గ్రంథకర్తయైన యోహానుకు కలిగిన దర్శనమును ఈ సందర్భములో గుర్తు చేసుకొనుట మనకు చాలా అవసరం. ఇతడు తన దర్శనములో ప్రతిమకు బదులుగా ఒక కౄరమృగము మరో క్రూరమృగముల రూపాలను కలిగియున్నట్లు గమనించ గలరు. 1) కౄరమృగము 2) చిరుత పులి 3) ఎలుగుబంటి 4) సింహము (ప్రకటన 13:1-5). దానియేలు విప్పిన కల భావము, యోహాను దర్శనమునకు దగ్గర పోలికలు ఉన్నట్లు కనబడుచున్నది అందు నాలుగు లోహములు, ఇందు నాలుగు జంతువులతో ప్రయోగింపబడిన రాజ్యములు భూమిని తమ సొంత అధికారముతో దేవునికి భిన్నంగా పరిపాలించిన 4 మహా సామ్రాజ్యములు.

ఆ రాజుల కాలంలో పరలోక మందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దానికెన్నటికిని నాశనము కలుగదు. ఆ రాజ్యము దానిని పొందిన వారికి గాక మరెవరికిని చెందదు. అది ముందు చెప్పబడిన రాజ్యములన్నింటిని పగులగొట్టి నిర్మూలము చేయును. గాని అది యుగముల పర్యంతము నిలుచును (దానియేలు 2:44). పై వచనమును బట్టి చివరి మహా సామ్రాజ్యమైన రోమా సామ్రాజ్యపు కాలములోనే సర్వోన్నతుడైన దేవుడు యుగముల పర్యంతము నిలుచు తన సామ్రాజ్యమును స్థాపించి యుండాలి. అయితే దేవుని రాజ్యము స్థాపించ బడినదా? లేదా? అనునది నేటి క్రైస్తవ ప్రపంచములో కొందరికి అర్థంకాని సంగతి. ఈ ప్రశ్నలకు జవాబు బైబిలే చెప్పాలి గాని మరెవ్వరూ చెప్పినా అది తప్పే అవుతుంది.

క్రీస్తు రాజ్యావిష్కరణ : పరలోక రాజ్యము సమీపించియున్నది - మత్తయి 3:1లో బాప్తీస్మమిచ్చు యోహాను నూతన శక ప్రారంభములో ప్రకటించు చున్నాడు. పరలోక రాజ్యము సమీపించియున్నది. మత్తయి 4:17లో యేసు ప్రకటించు

చున్నారు. పరలోక మందున్న మా తండ్రీ నీ రాజ్యము వచ్చుగాక - మత్తయి 6:10లో శిష్యులను యేసు ప్రార్థించుమన్నారు. పై సంగతులను బట్టి పాత నిబంధన కాలములో కాక క్రొత్త నిబంధన కాలమైన క్రీస్తు శక ప్రారంభములోనే సర్వోన్నతుని రాజ్య పాలన రావాలని కోరుకొంటున్నట్లు కనబడుచున్నది. ఈ విషయాన్ని బలపరుస్తూ మరో అద్భుతమైన వాక్యము క్రొత్త నిబంధనలో వ్రాయబడియున్నది. యేసు - ఇక్కడ నిలిచియున్న వారిలో కొందరు దేవుని రాజ్యము బలముతో వచ్చుట చూచువరకు మరణము రుచి చూడరని నిశ్చయముగా మీతో చెప్పు చున్నాననెను (మార్కు 9:1). దీని ప్రకారము క్రీస్తును వెంబడించిన శిష్యులలో కొందరు సర్వోన్నతుని రాజ్యం వచ్చుట చూచి ఉండాలనే నిజాన్ని సూచించుచున్నది. ఒకవేళ ఇప్పటికిని అనగా 2017 సం॥లు గడచిన దేవుని రాజ్యస్థాపన భూమి మీద జరుగలేదంటే పై వాక్యాను సారంగా కొందరు శిష్యులు నేటికిని చావక సుమారు 2000 సం॥లు ఆయుష్షు కలిగి ఉండాలి. ఇది అసంభవం, యేసును వెంబడించిన అపొస్తులులు మొదటి శతాబ్ధములో మరణించినారు. నేటివరకూ వారు బ్రతికిన దాఖలాలు ఏమీలేవు. గనుక ప్రారంభ శతాబ్ధములోనే దేవుని రాజ్యపాలన భూమిమీద ప్రారంభించ బడినదనుటకు సందేహం ఏమీలేదు (లూకా 11:20; 17:21).

ప్రకటన గ్రంథంలో 1000 ఏండ్ల పాలన గూర్చి అపొస్తులుడైన యోహాను - యేసు మనలను తన తండ్రియగు దేవునికి ఒక రాజ్యముగా చేసెను. మీ సహోదరుడను యేసును బట్టి కలుగు శ్రమలోను రాజ్యములోను పాలివాడైన యోహానను నేను అని ప్రకటన 1:6,9 వచనములలో సాక్ష్యమిచ్చుచున్నాడు. ఇతని సాక్ష్యమును బట్టి దేవుని రాజ్యము బలముతో వచ్చుట చూచిన వారిలో ఇతడు కూడ ఉన్నాడని ఋజువు పరచుకొనవచ్చు. అలాగే తండ్రి మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదలచేసి తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసులుగా చేసెను (కొలస్సీ 1:13). మనలను చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి పిలిచిన ఆయన గుణాతిశయములను ప్రచురము

చేయు నిమిత్తము, ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును పరిశుద్ధ జనమును దేవుని సొత్తయిన ప్రజలుగా చేయబడి యున్నాము (1పేతురు 2:9). పైన వ్రాయబడిన వచనముల సందర్భాన్ని పరిశీలిస్తే యేసుక్రీస్తు యొుక్క రాజ్యములో మనలను కూడా పరిపాలకులుగా (రాజులు) చేసి యున్నారని తేట తెల్లమగుచున్నది. నిస్సందేహముగా యోహాను పౌలు, పేతురు సాక్ష్యాలను బట్టి మొదటి శతాబ్ధ కాలములోనే క్రీస్తు రాజ్యము స్థాపించబడినదని గుర్తించవలెను.

ఇప్పుడు యేసుక్రీస్తు రాజ్యము ఎక్కడ ఉంది ? దేవుడు తన కుమారుడైన యేసును అనగా 'రాయిని' మొదటి మూడు సామ్రాజ్యాల పరిపాలనలో పంపలేదు గాని, నాల్గవ సామ్రాజ్యమైన రోమా సామ్రాజ్యపు చీలికల కాలంలో భూమిమీదికి పంపెనని సులువుగా గ్రహించవచ్చు. సర్వోన్నతుడైన దేవుడు తన కుమారుడైన క్రీస్తును (రాజును) ఈ భూమిమీద నియమించి నాటి నుండి నేటివరకు సర్వలోకమును పరిపాలించు వానిగాను చేసెను. రోమా గవర్నర్ అయిన పిలాతు యేసుతో నీవు రాజువా? అని ఆయనను అడుగగా యేసు నీవన్నట్లు నేను రాజునే, నా రాజ్యము ఈలోక సంబంధమైనది కాదు, నా రాజ్యము ఈ లోకసంబంధమైనదైతే నేను యూదులకు అప్పగింపబడకుండు నట్లు నా సేవకులు పోరాడుదురు గాని, నా రాజ్యము ఇహసంబంధమైనది కాదనెను (లూకా 23 : 42 - 43). ఈ వచనమునందు రెండు ప్రాముఖ్య మైన సంగతులను చూడవచ్చు. 1) సిలువలో దొంగ చనిపోయేటప్పటికి ఇంకా రాజ్యస్థాపన జరుగలేదు. 2) మరణించుటకు సిద్ధముగా నున్న దొంగ భూమిమీద స్థాపించబడబోవు క్రీస్తు రాజ్యము లోనికి వచ్చుట అసంభవం గనుక అతని కడకు పరదైసుకే ఆయన చేర్చెను.

**క్రీస్తు సంఘమే క్రీస్తు రాజ్యము** : యేసు రాజ్యము భూమిమీద సుమారు 2000 సం॥ల క్రితం ప్రారంభమై నువిశాలమైన భూమండలాన్ని ఆవరించి యున్నది. ఈ భూమిమీద 1. రాజుగా యేసుక్రీస్తును, 2. రాజ్యముగా క్రైస్తవులును, 3. భూభాగముగా యావత్తు ప్రపంచమును, (క్రైస్తవులు ప్రపంచమంతా విస్తరించి యున్నారు, ప్రపంచ అత్యధిక జనాభా

క్రైస్తవులే). 4. చట్టముగా నూతన నిబంధన గ్రంథమును మరియు 5. యుగ యుగములు కాలముగా నిర్ణయింపబడి నెబుకద్నెజరు రాజు యొక్క కల భావమును విశదపరచు చున్నది. పరిశీలించిన ఆధారము లన్నిటను బట్టి యేసుక్రీస్తు మొదటి రాకడలోనే భూమి మీద దేవుని రాజ్యస్థాపన చేసి (మత్తయి 28:18) రెండవ రాకడతో అదే రాజ్యాన్ని అనగా తన వారిని పరలోకానికి తీసుకొని పోయి, తండ్రికి అప్పగించును. ప్రతివాడును తనతన వరుసలో బ్రతికింపబడుదురు. అటు తరువాత క్రీస్తు సమస్తమైన ఆధిపత్యమును సమస్తమైన అధికారమును బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి భూమి నుండి తీసుకువెళ్లిన రాజ్యమును అప్పగించును. అప్పుడు అంతము వచ్చును. ఎందుకనగా తన శత్రువులందరిని తన పాదముల క్రింద ఉంచువరకు, ఆయన రాజ్యపరిపాలన చేయుచుండ వలెను (1కొరింథి 15:23-25). ఈ పరిశీలనలో ఎవరైతే ఈ రాజ్యాన్ని పొందియున్నారో ఇటు భూమీమీద క్షామము చెల్లిన పిమ్మట పరలోకమునకు వెళ్ళి యుగయుగాలు ఆయన రాజ్యముగానే యుందురని తేటతెల్లమగుచున్నది. దానికెన్నటికిని అంతము కలుగదు. భూమిమీద గల మానవ సామ్రాజ్యములన్నీ కూకటి వ్రేళ్లతో పెల్లగించబడినా, సర్వోన్నతుని రాజ్యము ఇక్కడ మహాభూతలమంత పెద్దదిగాను, పరలోకమునందు నిత్యము వసించు రాజ్యముగాను కనబడుచున్నది. కేవలం ప్రకటన 20వ అధ్యాయములోని పరిపాలనకు వక్రమార్గాలు చిత్రీకరిస్తే అసలు భూమిమీద దేవుని రాజ్యపరిపాలనే లేదని చెప్పవచ్చును. మానవ జ్ఞానాన్ని చొప్పించడం వలన దేవుని జ్ఞానం తన కుమారులకు అందక, ఉన్న రాజ్యము లేదనే తప్పులో మనలను ముంచి దేవునికి మనలను దూరస్తులుగా మార్చి కనబడని ఈ అపవాది నిత్య నాశనమునకు నడిపించుచున్నది. రహస్యమేదైనను తేటపరచబడకపోదు, బయలు పరచబడుటకే గాని, ఏదియు మరుగుచేయబడలేదు. వినుటకు చెవులెవనికైనను ఉండిన యెడల వాడు వినును గాక! (మార్కు 4:22).

రాజ్యస్థాపనను సూచించు సంఘటనను నూతన నిబంధనలో చూడగలము. పెంతుకొస్తు అనే

పండుగ దినమున, యెరూషలేము అను పట్టణములో అపొస్తులుల నాయకత్వమున పేతురు ప్రసంగము ద్వారా ఈ ప్రపంచములో మొట్టమొదటి సారిగా పెద్దసంఖ్యలో అనగా 3000 మంది యేసును నమ్మి బాప్తిస్మము పొందిరి. ఆ విధముగా ప్రభువులోకి వచ్చిన వీరు అప్పటినుండి అపొస్తులుల బోధయందు ను, సహవాసమునందును, రొట్టె విరచుటయందును, ప్రార్థన చేయుటయందును, యెడతెగక సంఘముగా కూడుకొనుచుండిరి. ప్రపంచ చరిత్రలో ఏ రాజ్యపరిపాలనాధికారములోను కనిపించని సామ్యవాదాన్ని వీరు చేసి చూపించినట్టుగా వారు తమ చర స్థిరాస్తులను, అమ్మి అందరికి వారి వారి అక్కరల కొలది పంచిపెట్టిరి. ఈలాంటి సమ సమాజములోనికి రక్షణ పొందుచున్న ప్రజలను ప్రభువే స్వయముగా ఆ సంఘములో చేర్చుచుండెను (అపొ.కా. 2:41-47). ఆనాటినుండి సంఘము లేక క్రీస్తురాజ్యము దినదిన ప్రవర్థమానము చెందుతూ మొదటి శతాబ్ధపు కాలములో ఆసియా, ఐరోపా, ఆఫ్రికా ఖండాలలో లక్షలు లక్షలుగా పెరిగిపోయింది. 2000 సం॥లు గడిచేసరికి ఈ సార్వత్రిక సంఘము లేక క్రీస్తు రాజ్యము ప్రపంచ జనాభాలో అత్యధిక శాతాన్ని సాధించింది. నేటికిని దేవుడు తన చట్టము (బైబిలు) ద్వారా అనేకులను అంధకార సంబంధమైన అధికారము నుండి విడుదలచేసి, తన కుమారుని వెలుగు రాజ్యములోనికి నడిపించుచున్నారు (2 కొరింథీ 4:4-6, కొలస్సీ 1:13).

పై విషయాలను పరిశీలించగలిగితే రాజ్యము, సంఘము లేక రాజ్య పరిపాలన, సంఘపరిపాలన ఒక్కటేనను విషయము తెలియుచున్నది. ఎలయనగా 1. యేసుక్రీస్తు రాజ్యానికి రాజుగా, సంఘానికి శిరస్సుగా కనిపించుచున్నారు (ఎఫెసీ 1:20-23). 2. నా రాజ్యము ఈలోక సంబంధమైనది కాదు అని పిలాతు ముందు ప్రస్తావించబడినవారే దేవుని నమ్మిన ప్రజలుగా లేక క్రైస్తవులుగా మరియు సంఘముగా వాక్యమందు కనబడుచున్నారు (1పేతురు 2:9, ఎఫెసీ 5:30-32). 3. నేడు క్రీస్తు సంఘము ప్రపంచపు అన్ని దేశములలో నిండిపోయినట్లుగా క్రీస్తు రాజ్యము కనబడుచున్నది (మత్తయి 28:19, మార్కు 16:15). 4. అటు రాజ్యముగా ఇటు సంఘముగా

పిలువబడుచున్న వారికి ప్రమాణ గ్రంథంగా, లేక చట్టంగా ఒకే బైబిలు తీసుకొనబడింది (యాకోబు 1:21, యోహాను 12:48, ప్రకటన 22:18-19). 5. క్రీ.శ సుమారు 33 సం॥ల తరువాత స్థాపించబడిన సర్వోన్నతుడైన దేవుని సంఘం లేక రాజ్యము నేడు క్రీస్తు సంఘముగా కనబడుచున్నది. పై పరిశీలన బట్టి దేవుని యొక్కయు, క్రీస్తుయొక్కయు, రాజ్యము లేక సంఘము ఒక్కటే అని సులువుగా చెప్పవచ్చును (ఎఫెసీ 5:5). ఇదే నేటి ప్రపంచ సార్వత్రిక సంఘము. ఈ సంఘానికి శిరస్సుగా లేక రాజుగా పాలన చేయుచున్న క్రీస్తే రారాజు. ఆయన చెప్పిన మాటలు చట్టముగాను, లేక జరుగుచున్న సంఘ పాలన అదే వాక్యాన్నిబట్టి నేటికిని జరుగుచున్నది. భవిష్యత్తులో జరగాలని ఖండితంగా చెప్పబడింది (ఫిలిప్పీ 3:16, ఎఫెసీ 3:3-4, ప్రకటన 1:3).

**ప్రకటనలో వెయ్యేండ్లు :** యోహాను వ్రాసిన గ్రంథములో వర్తమాన భూత భవిష్యత్ కాలములో జరుగుచున్న జరిగిన, జరగబోవు వాటిని వ్రాసియున్నాడు. అందునుబట్టి ఆ గ్రంథమందు వ్రాయబడినవి సందర్భాన్నిబట్టి అలంకారములను బట్టి ఆలోచించగలుగుటకు జాగ్రత్త పడవలెను. ప్రకటన 20:4-6 వరకు వ్రాయబడిన మూడు వచనములలో 1000 ఏండ్ల పరిపాలన గురించి ప్రస్తావించబడింది.

వెయ్యేండ్లు అనగానే దీర్ఘ కాలమును సూచించుచున్నది. ప్రకటన గ్రంథములో ప్రయోగించబడిన వస్తువులుగాని, జంతువులుగాని, అంకెలు మున్నగునవి గాని, కేవలము అలంకార రూపముగా వాడబడి వాటి వాటి స్వభావమును తెలియజేయుచున్నవి. ఉదా॥ యేసును గొఱ్ఱెపిల్లతో పోల్చినపుడు, యేసుక్రీస్తు స్వభావము గొఱ్ఱెపిల్లవంటి సాధు స్వభావము, మరియు సాత్వీకమైనదని అర్థము. అలాగే సాతానును ఘటసర్పముతో పోల్చినపుడు యుక్తి, కుయుక్తులకు, వంకరలకు, ప్రాణాపాయమునకు, రెండు నాలుకలతో అవును కాదను రెండు మాటలకు తగినదని స్వభావమునుబట్టి చెప్పబడినది. అంతేగాని యేసు ఆకారము గొఱ్ఱెపిల్లకాదు, సాతాను స్వరూపము సర్పమూ కాదని గుర్తించగలగాలి. అలాగే ప్రారంభ మానవుల జీవితకాలం సుమారు

1000 సం॥లు వారి ఆయుష్షు పరిమాణమునకు గుర్తుగా లేక రూపకాలంకారముగా. పెద్దలు తమ బిడ్డలను ఆశీర్వదిస్తూ - వెయ్యేండ్లు దీర్ఘాయువుతో వర్థిల్లుమని దీవించుదురు. అలాగని నేటి మానవులు వెయ్యేండ్లు బ్రతుకుతారని కాదు. దేవుని సామ్రాజ్యం ఎక్కువ కాలం వర్థిల్లుతుందనుటకు రూపకాలంకారముగా ఈ 1000 అనే అంకె దీర్ఘకాలమునకు గుర్తుగా ప్రయోగింపబడినది. అందువలన భూమిమీద క్రీస్తుపాలన సుమారు క్రీ.శ.33లో ప్రారంభమై నేటికిని స్థిరముగా నిలిచి యున్నది (1కొరింథి 15: 25). క్రీస్తు రెండవ రాకడతో ఇదే రాజ్యం పరలోకానికి చేరిపోతుందని ముందుగా చదివియున్నాము. ఈ సందర్భముగా నెబుకద్నెజరు కనిన కల భావాన్ని దానియేలు విప్పుతూ ఆ రాజుల కాలములో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యమును స్థాపించును. దానికెన్నటికిని నాశనము కలుగదు, అది యుగముల పర్యంతము నిలుచునని దానియేలు 2:44లో చెప్పబడినది.

వెయ్యేండ్ల పరిపాలన గూర్చి యోహాను - తాను కూడా అదే పరిపాలనలో ఉన్నట్లు మనకు ఖాయపరచిన విషయం నగ్నసత్యం. అయితే ఆ పరిపాలన రాబోతుందని గాని మరెక్కడో జరుగుతుందని గాని, ఆయన తన పుస్తకాలలో ఎక్కడను ప్రస్తావించలేదు. అలాగుననే తాను ముందుగా వ్రాసిన సంగతులకు భిన్నముగా ఆయనగాని, మరో బైబిల్ రచయిత గాని ఎక్కడనూ చెప్పక అదే విషయాన్ని బలపరుస్తూ పరిశుద్ధాత్మ ప్రేరణతో వ్రాసియున్నారు. ఈ విషయాన్ని గ్రహించని అనేకమంది ముందు వెనుకలు ఆలోచించకుండా చమత్కారముగా కల్పించబడిన అనేక మానవ సంగతులను మిళితము చేసి దేవుని జ్ఞానాన్ని తప్పుత్రోవ పట్టించు చున్నారు. లోకములో స్థాపించబడిన దేవుని రాజ్యాన్ని బైబిలును బట్టి చూడక, సందర్భాలను ఆలోచించక ఇప్పటికిని నీ రాజ్యము వచ్చుగాక అనే ప్రార్థన ఎంత అనాలోచనగా చేయు చున్నారు? అబద్ధ బోధకులు బయలుదేరి సామన్యులను మోసపుచ్చు చున్నారు. వారు సత్యమును ప్రకటించకపోతే, బాహ్య సామ్రాజ్యాన్ని చూస్తున్న సామాన్యులకు, ఆయన రాజ్యము వచ్చినదో, లేదో ఏలాగు తెలుస్తుంది? ఆయన రాజ్యము

వచ్చినట్లు నీకిప్పటికీ తెలియకపోతే నిన్ను క్రైస్తవ వేషంలో ఉన్న హేతువాదివిగానే పరిగణించాలి. దేవుని స్వరూపియైయున్న క్రీస్తు మహిమను కనుపరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింపకుండు నట్లు ఈ యుగ సంబంధమైన దేవత అవిశ్వాసులైన వారి మనో నేత్రములకు గ్రుడ్డితనము కలుగజేసెను (2 కొరింథీ 4:4). ఈలాగుననే బైబిల్‌లోని అనేక సంగతులను లేనివి ఉన్నట్టుగాను ఉన్నవి లేనట్టుగాను అమాయక ప్రజలను తప్పుదారి పట్టించి తీరని అన్యాయం చేస్తున్నారు నేటి అబద్ధ బోధకులు దేవుని ఆలోచనల లోనికి వీరిని పోనివ్వక, వీరి ఆలోచనలకు అనుకూలంగా దేవుని వాక్యమును కలిపి చెరుపుచున్నారు. ఎందుకనగా జనులు హితబోధను సహింపక దురద చెవులు గలవారై తమ స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమ కొరకు పోగుచేసికొని సత్యమునకు చెవి ఇవ్వక కల్పనా కథల వైపునకు తిరుగు కాలము వచ్చును (2 తిమోతి 4:3-4). ఈ ఘోరాలన్నింటికి ముఖ్య కారకుడైన అపవాది దేవుని ముసుగులో క్రైస్తవులకు సేవచేయుచున్నట్లుగా నటిస్తూ, కడకు నమ్మిన వారిని కూడా దారుణంగా నిత్యాగ్ని దండనకు బలి చేయుచున్నాడు.

నేటి ప్రపంచపు యేసురాజ్యం (క్రైస్తవులు) తమ రాజైన క్రీస్తు రాకడ కొరకు ఎంతో ఆశతో ఎదురుచూచు చున్నది. ఎందుకనగా యేసు తమ రాకడలో ఈ భూమి మీద గల తన రాజ్యమును తండ్రికి అప్పగించ బోతున్నారు. యేసు సమస్త ఆధిపత్యమును సమస్తమైన అధికారమును బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యమును (మనలను) అప్పగించును. అప్పుడు అంతము వచ్చును (1కొరింథి 15:23-25). ఒకనాడు పరలోకమనకు చేరు తండ్రి రాజ్యమే, నేడు యేసు పాలనలోయున్న క్రీస్తుసంఘము. గనుకనే - వ్యభిచారియైనను, అపవిత్రుడైనను, విగ్రహారాధికుడై యున్న లోభియైనను క్రీస్తు యొక్కయు, దేవుని యొక్కయు రాజ్యమునకు హక్కుదారుడు కాడను సంగతి మీకు నిశ్చయముగా తెలియును (ఎఫెసీ 5:5)

పి. విజయకుమార్
రామచంద్రపురం-9849289326

# సంక్షిప్త వార్తలు

2017 మే నెల 28వ తేదీనాడు సికింద్రాబాద్, యాప్రాల్‌లోయున్న సంఘము ఇద్దరికి బాప్తిస్మము నిచ్చిరి. అక్కడ స్థానిక సువార్తికులు సుధాకర్ గారు లెమూయేల్ గారు వాక్యమును బోధించగా యస్.బ్రహ్మయ్య గారు మరియు బి.రాజు గారు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. యాప్రాల్‌లో సోదరులు సుధాకర్ గారు లెమూయేల్ గారితో కలసి పనిచేయుచు స్థానిక క్రీస్తు సంఘమును ప్రభువు పనిలో ముందుకు నడిపించుచున్నారు.

2017 మే నెల 29,30,31 తేదీలలో కొత్తపేట మండలం వీధివారి లంకలో యున్న క్రీస్తుసంఘము యేసుక్రీస్తు రక్షణ సువార్తసభలు ఘనముగా నిర్వహించిరి. పి.జె.కృపాలిని (పలివెల), వి. చిన్నయ్య (కడలి), పి.డి.బిషప్ (మండపేట) గార్లు వాక్యపరిచర్యచేసిరి. స్థానిక సువార్తికులు కోనాల డేవిడ్‌రాజు గారు స్థానిక సంఘము ఈ కూటములలో సాధించిన మంచిఫలితముల కొరకు అభినందనీయులు

2017 జూన్ 1,2,3 తేదీలలో అమలాపురం కరక్కాయపేటలో యున్న క్రీస్తుసంఘము తమ వార్షిక సువార్త సభలను నిర్వహించిరి. ప్రతిరోజు వందలాది ప్రజలు హాజరై కడు ఆసక్తితో దేవునివాక్యము బోధింపబడుచుండగా విని గొప్ప ఆత్మీయానుభూతిని పొందిరి. కరక్కాయపేటలో సోదరులు వి.రాజ్ కుమార్, వి.బాబీ గార్లు నిరంతరం ప్రభువు కొరకు కృషిచేయుచు గొప్ప ఫలితములను సాధించుచున్నారు. ఈసువార్త సభలలో సోదరులు పి.ప్రవీణ్ కుమార్ (ర్యాలి), యం.జాన్‌డీడ్ (బిక్కవోలు), విప్పర్తి విన్ను (అమలాపురం), జాషువాగూటం (కాకినాడ), సాక మనోజ్‌హామ్, వి.రాజ్‌కుమార్ మరియు రాపాక రత్నరాజు గార్లు (పాలకొల్లు) వాక్యపరిచర్యచేసిరి. స్థానిక సంఘము ఈ కూటముల ద్వారా బలపడుటయేగాక హాజరైన వారందరు సత్యవాక్యమును మరింతలోతుగా గ్రహించుకొనగల్గిరి. ఆ మూడు దినములు స్థానిక సంఘము హాజరైనవారందరికీ మంచి భోజనములనేర్పాటు చేసిరి.

2017 జూన్ 5,6, తేదీలలో పెదపూడి మండలం గండ్రేడులోయున్న క్రీస్తుసంఘము రక్షణ సువార్తకూటములను నిర్వహించిరి. ఆ కూటములలో సోదరులు వి. రాజావిజయ కుమార్ (రాజమండ్రి), శేషం ప్రభాకర్ (కాకినాడ)

మరియు జాషువా గూటం గార్లు వాక్యపరిచర్యచేసిరి. మొదటిరోజున వర్షం వలన కొంత అభ్యంతరము కలిగినను ఆ రెండుదినములు సువార్తకూటములు జయకరముగా జరిగినవి. గంద్రేడులో సోదరులు యస్.జాన్ గారు పలు సంవత్సరములుగా వాక్యపరిచర్య చేయుచున్నారు. ముఖ్యముగా హిందువుల మధ్య ఆయన చేయుచున్న పరిచర్య ప్రశంసనీయము.

2017 జూన్ 22వ తేదీనాడు రిక్కీగూటం గారు కుటుంబసమేతముగా అమెరికా పర్యటన ముగించుకొని కాకినాడ క్షేమముగా చేరుకొనిరి. తదుపరి 27వ తేదీ ఉదయం అమెరికా నుండి 10 మంది యౌవనస్థులు వారితో కలసి ఒక నెలపాటు పనిచేయుటకు కాకినాడ చేరుకొనిరి. వారితో కలసి రిక్కీ గారు జూన్ 30వ తేదీనాడు కాకినాడలో బోధకుల సదస్సు ఘనముగా నిర్వహించిరి. ఆసదస్సులో విప్పర్తి బాబీ గారు, నలుగురు అమెరికా యువకులు, జాషువాగూటం గారు వాక్యపరిచర్యచేసిరి. 2017 జూలై 18వ తేదీన కాకినాడ సత్యవాణిలో మరియొక సదస్సు జరుగును. అందరూ ఆహ్వానితులే.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004